



తన పి.ఏ. చింతామణితో కలిసి కొంటె చూపులతో, కొంటె నవ్వులతో ఐస్‌క్రీమ్ అందిస్తుంటే... చప్పరిస్తున్నాడు రాహుల్. అలా ఐస్‌క్రీమ్ తింటూనే చటుక్కున ఒంగి ఆమె కెమ్మోవిని అందుకోబోతుండగా అప్పుడే భార్య రమ్య 'ఏమండీ! ఇవాళ షెడ్యూల్ మరిచిపోయారా? లేస్తే కదా...' అంటూ తనను తట్టి మరీ నిద్ర నుంచి లేపింది.

ఆఫీస్‌లోనూ ఇంతే —

తను చింతామణి చెయ్యి పట్టుకోబోతున్నప్పుడే బొజ్జూపుకుంటూ యుడి చెవు ప్రావు ఊడిపడతాడు.

ఆమెతో ధైర్యం చేసి కోరిక వెళ్ళబుచ్చబోతున్నప్పుడే పళ్ళెత్తు డిస్పాచ్ క్లర్క్ కాంతం వచ్చేస్తాడు.

అలా ఎవరో ఒకరు సమయానికి అడ్డుపడుతూ చింతామణిని అందని ద్రాక్షపండు చేస్తున్నారు.

ఇప్పుడు కలలోనూ అందలేదంటే... ఛ!

ఈ చిరాకునంతా బార్యపై ప్రదర్శించాడు రాహుల్ 'ఏం మునిగిపోయిందనే బంగారంలాంటి నా నిద్రను పాడుచేశావు? ఆదివారం కదా! ఓ గంట లేటుగా లేస్తే నీ సొమ్మేం పోయేది...'

'రాత్రో మాట, పగలో మాట. ఇందుకే మీ మగవాళ్ళను నమ్మకూడదు. నాకు పనిలో సాయం చెయ్యమని లేపలేదే —ప్రతి పెళ్ళిరోజు శివాలయానికి వెళ్తుంటామా పెంద రాళే. అలాగే ఇవాళ లేస్తే ఫ్రెష్‌గా ఆల

యాని కెళ్ళొచ్చని రాత్రి మీరే చెప్పి ఇప్పుడిలా ఎదురుతిరుగుతున్నారే! పోన్లెండి... మీకు లేని ఇంట్రెస్టు నా కెందుకట...' ఆమె ముఖం మాడ్చుకుని అవతలికి నడిచింది.

ఆఫీస్ కెళ్ళాడనే కానీ రాహుల్ మనసంతా అదోలా ఉంది.

'ఉదయాన్నే ఇద్దరి మూడ్ పాడయిందని మన నెక్స్ట్ ప్రోగ్రాంకూ బ్రేక్ పడినట్లనుకోకండి! ఇంట్లోనే పూజ చేసేశాను లెండి! ఆలయానికి రాలేనందుకు ఆ దేవదేవునికి క్షమాపణ చెప్పుకున్నాను. సాయంత్రం త్వరగా వచ్చేయండి!' అంటూ ఆఫీసు కొస్తూండగా 'మామూలు' ఇచ్చింది రమ్య.



ఆమె అమాయకమైన ముఖంలోకి సూటిగా చూడలేక పోయాడతను.

ఏ విషయానా తనకు లోటు చెయ్యడం లేదామె. మరేం తక్కువని చింతామణి ప్రాపునకై అర్రులు చాచడం?

భార్యయినా, భర్తయినా ఒకర్నొకరు మోసగించుకోవడమంత దౌర్భాగ్యస్థితి తలెత్తకూడదు!

'ఇంట్లో ఉండే ఆడదానివిగా నీ పరిధి లోనే ఆలోచిస్తావు. బయట తిరిగే మగాడిగా పరస్త్రీ సాంగత్యం జబ్బు అంటుకోని కలలో సైతం మలినమైన నేను అగ్నిసాక్షిగా తాళి కట్టిన నీతో భగవంతుని సన్నిధిలో కలకాలం మన బంధం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎడబాయకుండాలని ఎలా వేడుకోను చెప్పు? అంత ఆత్మవంచనగా దేవుడెదుట నిలబడే ధైర్యమయితే నాకు లేనందుకే నిన్ను కసురుకొన్న తర్వాతయినా ఈ ఆత్మవిమర్శతో నీతో ఆలయానికి రాలేకపోయాను. నన్ను క్షమించు డాళింగ్!' ఇలా తనలోనే రాహుల్ మథనపడ్తున్నప్పుడే చింతామణి ఛాంబర్‌లో కొచ్చింది.

అఫీషియల్ టాక్ అయ్యాక 'చాలా రోజుల బట్టీ గమనిస్తున్నాను సార్! నన్నేదో అడగాలనీ, నన్ను తాకాలనీ మీరు తహతహలాడుతున్నారు. కదూ? ఆడదాన్నిగా నేను బయటపడకూడదని ఇన్నాళ్ళూ ఆగాను. నా వంక నుంచి నో ఆబ్జెక్షన్! మీదే ఆలస్యం...' కొంటెగా నవ్వుతూ ఆమె మనసులో మాట బయటపెట్టింది.

'నిజమే, చింతామణీ! నిన్నటిదాకా నీ స్పర్శకై ప్రాకులాడాను. కానీ నా భార్యకు ద్రోహం చేయడానికి ఈ ఉదయాన్నుంచీ నాకు మనస్కరించడం లేదు. నాతో సంబంధం పెట్టుకోవడానికి నువ్వు సిద్ధపడ్డావంటే...రేపు పెళ్ళి చేసుకున్న నీ భర్తకు నీ పవిత్రతతో మధురిమ ఏం అందేట్లు? అదే నా భార్య అయితే నా ఒక్కడి సొత్తే! నాలా ఆమె పరాయి రుచులకు మరిగినట్లుగా తెలిస్తే నా మగతనాని కెంత అవమానమో, అదే న్యాయం ఆమె వంక నుంచీ కాపాడాలని నేను చూడనప్పుడు వివాహ వ్యవస్థకు విలువే లేదు...' ఈ భావ పరంపరతో బాస్ ఆమె కేసే నిర్లిప్తంగా చూస్తూంటే—

మరోలా అర్థం చేసుకుని 'వెన్యూ ఎక్కడాని ఆలోచిస్తున్నారా సార్?'

ఆమెనిక భరించలేనట్లు గిల్టీగా తలొంచుకున్నాడు రాహుల్ 'గో టూ యువర్ సీట్ ప్లీజ్!' అంటూ.

'ఆడది తనంతట ముందుకు రాకూడదంటారు ఇందుకే!' దెబ్బతిన్న కోడెనాగులా బుసకొట్టింది చింతామణి.

ఆ రాత్రి భార్య సన్నిధిలో పరవశిస్తూ 'ఉదయం నా నెగెటివ్ ప్రవర్తనపై నువ్వేమీ నొచ్చుకోలేదు. మామూలుగానే మసలుతున్న నీ మంచితనాన్ని భరించలేకున్నాను రమ్యా!' అన్నాడు రాహుల్.

'ఆలుమగల్లో ఏ ఒక్కరు ట్రాక్ తప్పినా మరొకరు ఓరిమి వహించాలి. దారిలో పడేలా చూసుకోవాలి. ఆ విషయంలో ఆడదాని పాత్రే ఎక్కువ. భర్త మూడ్స్‌తో ఎప్పటికప్పుడు సర్దుకుపోవడమే హైందవ స్త్రీ ధర్మం.' అంది రమ్య.

'ఇలాంటి ధర్మపత్నివి కాబట్టే నిన్ను వంచింపను నా అంతరాత్మ అంగీకరించింది కాదు. ఇంకెన్నడూ తప్పటడుగు వేయను. నీపై ఒట్టు!' అస్పష్టంగా సణుగుతూన్న భర్త ముఖంలోకి అర్థంకానట్టు చూసింది రమ్య.

'కలలోనూ, ఇలలోనూ నువ్వే నా సర్వస్వం! మన పెళ్ళై మూడేళ్ళు దాటుతున్నా ఇంకా సంతానం కలగలేదంటే నా శ్రమలో లోపం ఉన్నట్లే! చూసుకో, పై సంవత్సరానికి ఇదే నాటికి మన మధ్య ఉంగా... ఉంగా...' రమ్యను బాధించకూడదని మరింత హుషారుగా, జోరుగా ఉండానికి ప్రయత్నించాడు రాహుల్.

●

## వికటించిన పబ్లిసిటీ

గతంలో ప్రముఖ దర్శకుడు సుభాష్ ఘాయ్‌ని కోర్టుకీడ్చిన ఘనత మాధురీదీక్షిత్, మనీషాకోయిరాలా, మహిమాచౌదరి— వీళ్లే దక్కించుకున్నారు. ఆ వరుసలోనే ఇప్పుడు ఐశ్వర్య. ఎందుకో తెలుసా? ముంబై వీధుల్లో అతిచిన్న బాడీసూట్ వేసుకుని ఉన్న ఐశ్వర్య హోర్డింగ్స్ జనానికి కనిపించడమే! అవన్నీ తీయించెయ్యమని ఆమె డిమాండ్ చేసినా



లాభం లేకపోయింది. స్కిన్ కలర్ స్విమ్ సూట్ ఐశ్వర్యకు ఎంతగా 'సూట్' అయిందీ తెలిస్తే అర్థమవుతుంది అసలు కథ! అంతగా ఒంటినంటిపెట్టుకుని ఉండి ఐశ్వర్య అందాలను కనువిందు చేస్తుందిట ఆ 'సూటు!' అయినా అమితాబ్ లాంటి 'బిగ్ బీ' నీ 'హమ్ దిల్ దేచుకే సనమ్' చిత్రాన్ని ఆరుసార్లు చూశాడట కదా! ఇలాంటివాటిని పెట్టించు కోవడమెందుకుట? ★

## అప్పుడే మర్చిపోయారా?

మనదేశంలో సి.బి.ఐ డైరెక్టర్లు రిటైర్ అయ్యాక ఏం చేస్తారు? అదృష్టం బాగుంటే ఉన్నత పదవులకు నామినేట్ అవుతారు. లేదంటే రాజకీయాలను ఆశ్రయిస్తారు. అయితే ఈ మధ్య వారెవరికీ అదృష్టం బావున్నట్లు లేదు. అంతా ఏదో ఒక పార్టీ ఆఫీసులో కనబడుతున్నారు. కె.విజయరామారావు తెలుగుదేశంలో చేరగా, జోగీందర్ సింగ్ తదితరులు బి.జె.పికి జై అన్నారు. ఇక ఆర్.సి. శర్మ 10 జనపథ్‌ని వదలడం లేదు.



ఉదయాన్నే సోనియా ఇచ్చే టీని పుచ్చుకునే బృందంలో మనకు క్రమం తప్పకుండా కనబడే ముఖం శర్మదే! రాజకీయ పార్టీలు కూడా మాజీ ఇంటెలిజెంట్ ఏజెంట్లను చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నాయి. వారి తెలివి, అనుభవం తమకు ఏ విధంగానైనా పనికొస్తాయని వాటి ఆశ. కానీ ఇదే ఇంటెలిజెన్స్ నివేదికలు 1989 ఎన్నికల్లో రాజీవ్‌గాంధీ గాలి వీస్తుందని నమ్మకంగా చెప్పినప్పటికీ ఆయన ఘోరంగా దెబ్బతిన్న విషయం ఏ పార్టీకీ గుర్తు లేనట్లుంది.